క్లుప్తంగా

నేడు వలంటీర్లకు 'వందనం'

కొత్తపల్లి: వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం పది గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు. ఎంపీపీ కారే సుధ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు వలంటీర్లకు అవార్డుల ప్రదానం చేస్తారన్నారు. వలంటీర్లందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పంచారామ క్షేత్రంలో చురుగ్గా అభివృద్ధి పనులు



ఆలయంలోని నీరు బయటకు పోయే విధంగా జరుగుతున్న డ్రైన్ పనులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఎంపీ వంగా గీత విడుదల చేసిన నిధులతో ఆలయంలోని వ్యర్థాలతో కూడిన నీటిని పొలాలకు మళ్లించే డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న రాళ్లను తొలగించి భక్తులు నడిచి వెళ్లే సమయంలో ఇబ్బంది లేని విధంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. పురావస్తు శాఖ తయారు చేసిన ప్రణాళిక మేరకు పనులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా బ్రహ్మానందం

సామర్లకోట: కుమారారామభీమేశ్వర బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడిగా అప్పల బ్రహ్మానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా వద్దిపర్తి అనంత శివ రామకృష్ణ, కార్యదర్శిగా యర్రమిల్లి రాజగోపాల్, సహాయ కార్యదర్శిగా మేడవరపు బ్రహ్మన్న, కోశాధికారిగా పాలగుమ్మి రామలింగేశ్వరరావు, అడిషనల్ కార్యదర్శిగా గండికోట సోమేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలిగా ఆకెళ్ల వెంకటలక్ష్మీ సూర్యప్రభ ఎన్నిక అయ్యారు. వీరిని బ్రాహ్మణ సంఘ సభ్యులు అభినందించారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్

కొత్తపల్లి: పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్ అన్నారు. మండలంలోని కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందుబాటులో ఉన్నారా, లేరా, రోగులకు అందే వైద్య సేవలపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బంది సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి రాజ్‌కుమార్‌ను ఆదేశించారు.

ఆలయాన్ని కప్పేసిన టీడీపీ ఫ్లెక్సీలు



కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే వర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. స్థానికంగా ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయానికి ఫ్లెక్సీలు కట్టి పూర్తిగా మూసేశారు.

జగదానందకారకం.. దేవదేవుని కల్యాణం

- వైభవంగా భీష్మ ఏకాదశి పూజలు
- కన్నుల పండువగా స్వామి, అమ్మవార్ల దర్శనాలు
- భారీ సంఖ్యలో వచ్చిన భక్తజనం



కుంతీమాధవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల పరిణయం నిర్వహిస్తున్న అర్చకులు



గొల్లప్రోలులో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన కుంతీ మాధవ స్వామివారి దివ్య కల్యాణం మంగళవారం రాత్రి కనుల వైకుంఠంగా జరిగింది. ఉదయం పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పేరున అర్చకులు తొలి అర్చన చేశారు. భక్త జనసందోహం నడుమ కుంతీమాధవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల పరిణయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గజ వాహనంపై గ్రామోత్సవం అనంతరం పెండ్లి కుమారుడైన కుంతీమాధవస్వామిని, పెండ్లి కుమార్తెగా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించారు. స్వామివారిని, అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి, విద్యుద్దీపాలు, పువ్వులతో అలంకరించిన కల్యాణ వేదికపై అధిష్టించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు యాజ్ఞికంలో వేదమంత్రాల నడుమ విశ్వక్సేన పూజతో ప్రారంభించి, స్వామివారి కల్యాణం కనులపండువగా జరిపించారు. ఆలయ ఈఓ శ్రీరాములు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం అనంతరంరాత్రి 9 గంటలకు ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, అర్చనలు చేసి దివ్య కల్యాణం నిర్వహించారు.



కొమరగిరిలో ఆలయం వద్ద ఎంపీ గీత



పిఠాపురంలో గజవాహనంపై స్వామి గ్రామోత్సవం



గొల్లప్రోలులో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

ప్రతి ఒక్కరూ భక్తిభావాలు అలవర్చుకోవాలి

కొత్తపల్లి: దైవభీతిని కలిగిఉండి, ప్రతిఒక్కరూ భక్తి భావాలను అలవచ్చుకోవాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. భీష్మ ఏకాదశి సందర్భంగా మండలంలోని కొమరగిరిలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం జరిగిన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, నాయకులు కఠారి రాజబాబు, మేడే సోమరావు, మేడే సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: భీష్మ ఏకదాశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాకతిప్ప శాలివాసలో ఉన్న పద్మశాలి రామాలయం, కొమరగిరిలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, గోర్స, కొండెవరం, రమణక్కపేట, నాగులాపల్లి, కోనపాపపేట, ఉప్పాడలోని వేంకటేశ్వర, విష్ణాలయాల్లో పూజలు చేశారు

పంచారామ క్షేత్రంలో...

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో భీష్మ ఏకాదశి, స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు, తొలిపూజా కార్యక్రమంలో ఈఓ పాల్గొన్నారు. స్వామి వారి జన్మనక్ష త్రం సందర్భంగా ఆలయంలోని ఉప ఆలయాలలోను ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్య నారాయణ మూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

మాండవ్య నారాయణుని గ్రామోత్సవం

స్థానిక అతి పురాతన మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం మంగళవారం భక్తి శ్రద్ధలతో సాగింది. ఉదయం స్వామికి అభిషేకాలు, పూజలు చేసి, సాయంత్రం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన

మండల పరిధిలోని వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష పుష్పార్చన చేశారు. 108 మంది మహిళలు ఈ సామూహిక పూజల్లో పాల్గొన్నారు. శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ ఉత్సవాలల్లో భాగంగా గోపూజ, అభిషేకాలు, వాహన పూజ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను శేష వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించి వాడపల్లి గోపాలాచార్యుల పర్యవేక్షణలో కల్యాణం చేశారు. పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాసు దంపతులు, నున్న రామకృష్ణ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఆలయం వద్ద మహిళలచే సహస్ర దీపాలంకరణ జరిగింది. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ నాయకులు గోలి ధర్మరాజు, నున్న రామకృష్ణ, గోలి సోమేశ్వరరావు, వల్లూరి శేఖర్ సేవలందించారు. ఆలయ ప్రధానార్చకుడు సురేష్ ఆచార్యులు, వాడపల్లి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు.

పెద్దాపురంలో

పెద్దాపురం: భీష్మ ఏకాదశి వేడుకలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. కాండ్రకోట ప్రసన్నాంజనేయుని సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి ఏకాహం నిర్వహించారు. గుడివాడ పచ్చాలమ్మ అమ్మవారి ఆలయంలో ఏకాహం చేశారు. కృష్ణాశ్రమం గురువు గవరసాని గోపాలకష్ణ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించగా పల్లకిని సర్పంచ్ కనపర్తి చీమదొర తదితరులు మోశారు. తాటిపర్తిని ప్రసన్నాంజనేయ స్వామి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ యూత్ అధ్యక్షులు గోపు మురళి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో స్థానిక కుమ్మర వీధిలో గీతా పారాయణ నిర్వహించారు. అనంతరం గీతా ప్రవచనం చేశారు. నిర్వాహకులు సత్యకుమార్, నేతి వీరభద్రరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు నిర్వహించారు.

కేశవ పట్టాభిరామ కల్యాణోత్సవాలు ప్రారంభం

మండలంలోని కట్టమూరు గ్రామంలో కొలువైన కేశవ పట్టాభి రామస్వామి కళ్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, ఆలయ చైర్మన్ మేడిద వెంకట రామారావుల ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ, దివ్య కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, చలువ పందిళ్లతో అలంకరించారు. ఉదయం గ్రామోత్సవాన్ని నిర్వహించి స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. 25వ తేదీన భారీ అన్న సమారాధన, శ్రీపుష్పోత్సవం నిర్వహించనునట్లు ఈఓ తెలిపారు.



లక్ష పుష్పాలతో పూజలు చేసిన మహిళలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు



వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం



గీతా పారాయణ నిర్వహిస్తున్న మల్లికార్జున స్వామి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కేశవ పట్టాభిస్వామి

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ రామారావుకు వినతి పత్రం అందజేసిన కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: పట్టణ పరిధిలోని టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని కొరుతూ అధికార పక్ష కౌన్సిలర్ నేతల హరిబాబు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల టిడ్కో ఇళ్ల కేటాయింపులో జాప్యం జరిగిందన్నారు. దీని వల్ల అనేక మంది లబ్ధిదారుల వయసు పెరిగిపోవడంతో పాటు లబ్ధిదారులలో అనేక మంది మృతి చెందారని తెలిపారు. దాంతో వయసు పెరిగిన వారిని, చనిపోయిన వారి బంధువులను అనర్హులుగా గుర్తించినట్టు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని టిడ్కో ఇళ్లకు సొమ్ములు చెల్లించిన అనర్హులకు న్యాయం చేయాలన్నారు. టిడ్కో గృహాలలో ఖాళీగా ఉన్న ఇళ్లను కావలసిన వారికి కేటాయించి వారి నుంచి వసూలు చేసిన డిపాజిట్లను అనర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు వారు కట్టిన సొమ్మును చెల్లించాలన్నారు. టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు అందేలా చేయాలని సూచించారు.

మేమంటే వెటకారంగా ఉందా?

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం



అధికారులను నిలదీస్తున్న వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి

పిఠాపురం: మీరు రమ్మన్నప్పుడు రావడం, పెట్టింది తిని, ఇచ్చింది తాగి పోవడానికేనా ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నది, మేమంటే అంత వెటకారంగా ఉందా? అంటూ పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి, మొగలి జయబాబుతో పాటు, పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తే కనీసం ఒక్క రోజు ముందైనా సమాచారం ఇవ్వాలని, మంగళవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, సోమవారం రాత్రి సమాచారం ఇవ్వడం ఏమిటంటూ అధికారులను నిలదీశారు. ఒక గంట ముందు సమాచారం ఇచ్చే బదులు, తమ ఇళ్లకు నోటీసు అంటించి వెళ్లండంటూ మండిపడ్డారు. ఇంత హడావిడిగా అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏం వచ్చిందంటూ వారు ప్రశ్నించారు. ఇది ప్రజల అవసరాలు తీర్చేందుకు అత్యవసర సమావేశంలా లేదని, కేవలం కొందరి స్వలాభం కోసం అత్యవసరంగా పెట్టుకున్న సమావేశంలా ఉందని పేర్కొన్నారు. గత నెలలో నిర్వహించిన సమావేశంలో జమా ఖర్చులు పనుల వివరాలు అడుగుదామంటే అధికారులు అందరూ సెలవులపై వెళ్లిపోయారని, వచ్చే సమావేశంలో వివరాలు ఇస్తామన్నా.. ఇప్పుడు వాటి జోలికి వెళ్లకుండా అత్యవసరం అంటూ అజెండా రూపొందించి, సంతకాలు పెట్టి పోండన్నట్టుగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సామర్లకోటలో ఇటీవల నిర్వహించిన సీఎం సభకు జనాన్ని ఆటోల్లో తరలించినట్టు, దీనికి రూ.2 లక్షలు ఖర్చు చేసినట్టు బదిలీపై వెళ్లిన కమిషనర్ సత్యనారాయణ రికార్డుల్లో చూపించారని చెప్పారు. అసలు సీఎం సభకు ఆటోలే పెట్టలేదని, ఈ ఖర్చుల వివరాలు తెలపాలని గత సమావేశంలో అడిగామన్నారు. నగర పంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు రూ లక్షలు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపించారని, నిజానికి అంత ఖర్చు కాలేదని, దీనిపై వివరణ ఇవ్వాలని అడిగినా సమాధానం లేదన్నారు. అక్రమాలను నిలదీస్తారనే గత సమావేశానికి ఆ అధికారులు హాజరుకాలేదని కౌన్సిలర్లు ఆరోపించారు. జమా ఖర్చులు అడిగితే, కార్యాలయ పనివేళల్లో వచ్చి తీసుకోవాలంటూ ఏఈ ప్రభాకర్ చెబుతుండడం చూస్తే, తాము కౌన్సిలర్లలా కనిపించడం లేదని అర్థమవుతోందన్నారు. కౌన్సిల్ సభ్యులకే సమాధానం ఇవ్వని అధికారులు సామాన్య ప్రజలకు ఏం జవాబుదారీగా ఉంటారంటూ మండిపడ్డారు. వీటన్నింటికీ సమాధానం చెబితేనే సమావేశం కొనసాగించాలంటూ పట్టుబట్టారు. వీటిపై సమాధానం ఇచ్చిన ఏఈ ప్రభాకర్ ఈ నెల 31న మీటింగ్ పెట్టి, అన్ని వివరాలు సభ్యులకు చెబుతామని చెప్పడంతో, సమావేశంలో ఉన్న వారంతా అవాక్కయ్యారు. ఈ నెల 29 వరకే కదా, 31 అంటే మీటింగ్ లేనట్టే, సమాధానం కూడా లేనట్టేనా అంటూ ఎద్దేవా చేశారు. దీంతో నాలుక్కరుచుకున్న ఏఈ ఈ నెల 29న మీటింగ్ పెడతామంటూ పొరబాటును సరిదిద్దుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి.రవికుమార్, వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జీపీడీపీ ప్రణాళికలు సిద్ధం చేయండి

ఈఓపీఆర్డీ రాజశేఖర్



జి.రాగంపేటలో పీఎం విశ్వకర్మ ఆన్‌లైన్ ప్రక్రియపై సమీక్షిస్తున్న రాజశేఖర్

పెద్దాపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సిబ్బంది సత్వరమే జీపీడీపీ ప్రణాళికలను సిద్ధం చేయాలని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ ఆదేశించారు. మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి పంచాయతీల్లో జీపీడీపీ ప్రణాళికలపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వడ్లమూరు, గోరింట జీపీడీపీ ప్రణాళికలు సిద్ధమయ్యాయని, మిగిలిన గ్రామాల్లో సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. 17 బీసీ కులాలకు సంబంధించి పీఎం విశ్వకర్మ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఇంటిపన్ను డిమాండ్లను ఆన్‌లైన్‌లో సరిదిద్దాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సచివాలయ సిబ్బంది మరింత సేవలందించాలని రాజశేఖర్ సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో నాలుగు అంశాలపై సమీక్షించారు.

ఆయిల్ పామ్ సాగుకు మరింత సబ్సిడీ

జిల్లా ఉద్యాన శాఖాధికారి మల్లికార్జునరావు



ఆర్‌బీ పట్నం సచివాలయంలో ప్రసంగిస్తున్న మల్లికార్జునరావు

పెద్దాపురం: ఆయిల్ పామ్ రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించాల్సిన అవసరం సిబ్బందిపై ఉందని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎన్.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం, సీబీ దేవం, కొండపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌బీ పట్నం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూరగాయలు, అరటి, దుంప తదితర ఆయిల్‌పామ్ పంటలు సాగు చేస్తున్న రైతులకు హెక్టారుకు రూ.5250 సబ్సిడీని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రైతులు మరింత సాంకేతిక పరిజ్ఞానం సాధించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రోజుకు ఒక్కరికి రూ.500 చొప్పున రెండు రోజులకు 30 మంది రైతులకు రూ.30 వేలు అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ సాగును పరిశీలించారు. మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత, చిలకమ్మ, రైతులు పాల్గొన్నారు.

నామినేషన్ వరకూ ఓటు నమోదుకు అవకాశం



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ కృష్ణమూర్తి

కొత్తపల్లి: రానున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం వరకు ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని పిఠాపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల ఓటర్ల జాబితాను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,30,370 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో కొత్తపల్లి మండలంలో 64,966 మంది ఉండగా, వీరిలో పురుషులు 32,445, మహిళా ఓటర్లు 32,521 మంది ఉన్నారని వివరించారు. ఈ జాబితాలో ఓట్ల సవరణ, మార్పులు, చేర్పులకు, తొలగింపునకు అవకాశం ఉందన్నారు. ఈ జాబితాపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించవలసిన బాధ్యత ఉందన్నారు.

వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు నంగిన సత్యానందంతో కలసి శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకుడు రాయవరపు వీరబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మందిర నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన ఈ శిబిరం నిర్వహించి సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి 30 మందిని ఆపరేషన్లకు గుర్తించారు. మందిరాల వ్యవస్థాపకురాలు నంగిన శాంతమ్మ జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు.

అవినీతి రహిత అభివృద్ధి జగన్‌కే సాధ్యం

ఎంపీ వంగా గీత

పిఠాపురం: ప్రజా సంక్షేమమంటే అభివృద్ధి చేయడం మాత్రమే కాదని, ఎటువంటి అవినీతి లేకుండా ప్రజలకు నేరుగా సంక్షేమం అందించడమేనని, అది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. ఆమె మంగళవారం గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజల వద్దకే పథకాలు తీసుకెళ్లి, నేరుగా లబ్ధిదారులకే అందేలా చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సఫలీకృతులు అయ్యారన్నారు. అందుకే ప్రజలందరూ మళ్లీ ఆయనే ముఖ్యమంత్రిగా చేయాలనే దృఢసంకల్పంతో ఉన్నారన్నారు. అన్ని వర్గాలకు, అన్ని కులాలకు, మతాలకు అర్హతే ప్రామాణికంగా పథకాల పంపిణీ జరుగుతోందన్నారు. మళ్లీ మరింత అభివృద్ధి, సంక్షేమం కావాలని కోరుకుంటున్న ప్రజలు మళ్లీ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. ఆమె పలు సీసీ రోడ్లు ప్రారంభించారు. పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు బొగలి అయ్యారావు, ఎంపీపీ ఆరిగెల రామయ్యమ్మ, జెడ్పీటీసీ నాగలోవరాజు, మండల అధ్యక్షుడు రామయ్యదొర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

వలంటీర్లకు మించిన సేవకులు లేరు

సేవే పరమావధిగా పని చేస్తున్న వలంటీర్లను మించిన సేవకులు లేరని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురం మండలం, పట్టణంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా విచ్చేసి, వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి వలంటీర్ తాను పని చేసే ఇళ్లకు కొడుకులా, కూతురుగా మారి పోయారన్నారు. ఎక్కడా అవినీతి, అక్రమాలు, స్వలాభానికి ఆస్కారం లేకుండా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థను తెస్తే, ఎంతో మంది దానిని తప్పుగా చూపించాలని చూశారన్నారు. అనతి కాలంలోనే ప్రజల మన్ననలు పొందిన వ్యవస్థగా వలంటీర్లు గుర్తింపు సాధించడంతో, ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి చూస్తున్నారంటే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంత మంచిదో అర్థమవుతోందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ వల్లే ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ తీసుకురావడం సీఎం వైఎస్ జగన్ ప్రజలకు చేసిన మేలుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పలువురు వలంటీర్లను శాలువాలతో సన్మానించి, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, గండేపల్లి బాబీ, మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, కొత్తపల్లి బుజ్జి, బొజ్జా రామయ్య, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం, మాదక ద్రవ్య రహిత సమాజం కావాలి

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ మద్యం, మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం కృషి చేయాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జనవిజ్ఞాన వేదిక సభ్యుడు ఎస్.సూర్యనారాయణ అన్నారు. అమీనాబాదు, ఉప్పాడ బీచ్ రోడ్డులో మంగళవారం కమిటీ, వేదిక సభ్యులు ర్యాలీ నిర్వహించారు. మద్యపానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వేమగిరి తలుపులయ్య, తరుణ్, వి.ప్రభుదాసు, కరుణాప్రసాద్, డేవిడ్ దోనియా, గుర్రాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పాడ బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు